ప్రజాశక్తి
గురువారం 19 జూన్ 2025

నేడు పిసిసి అధ్యక్షులు షర్మిల రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిసిసి అధ్యక్షులు షర్మిల గురువారం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గాల ఇన్చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర అధ్యక్షులు షర్మిల జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

కొందరికే 'విద్యార్థి మిత్ర'

విద్యార్థులకు అరకొరగా కిట్లు అందజేత
పూర్తిగా రాని యూనిఫాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు తెరిచిన రోజునే 'విద్యార్థి మిత్ర' కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని ఒక పక్క ప్రభుత్వం, మరోవైపు అధికారులు చెప్పుకొచ్చారు. కానీ క్షేత్ర స్థాయిలో పూర్తిగా ఇంకా చేరుకోలేదు. వచ్చిన కిట్లలో కూడా పలు వస్తువులు జిల్లాకు రాలేదు.

జిల్లాలో 1717 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,17,839 విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు కోసం ప్రతిపాదనలను జిల్లా అధికారులు విద్యాశాఖకు పంపించారు. సర్వేపల్లి రాధాకష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్ కెవిఎం) కిట్లలో నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్ట్, ఒక జత షూస్, రెండు జతల సాక్స్, డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బ్యాగు ఉన్నాయి. యూనిఫారం కుట్టించుకునేందుకు కుట్టి కూలి ఇస్తారు. వేసవి సెలవుల్లోనే ఈ కిట్లను పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టు అధికారులు అన్ని పాఠశాలలకూ వీటిని అందించాలి. కానీ ఆచరణలో పూర్తిస్థాయిలో సామగ్రి చేరుకోలేదు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ గత ప్రభుత్వానికి ధీటుగా విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తామని చెప్పుకొచ్చారు. కానీ, పాఠశాలలు తెరిచిన వెంటనే ఇవ్వాల్సిన కిట్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఒక్కో కిట్‌కు రూ.2,300 ఖర్చు చేసి ఇస్తున్నామని గొప్పలు చెప్పినా ఆచరణలో పూర్తిస్థాయిలో

మండలాలకు కిట్లు పంపుతున్న సిబ్బంది

వస్తువులను అందివ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొరగానే బ్యాగులు.. పూర్తిగా రాని యూనిఫాం

జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ కలిపి 7,88,900 నోట్ పుస్తకాలకు గాను పూర్తిస్థాయిలో వచ్చాయి. బ్యాగులు 1,17,839కు గాను 1,04,394 వచ్చాయి. బెల్టులు 77,201కు గాను అంతే వచ్చాయి. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెల్టులు రాలేదు. షూస్ 1,17,683కు గాను అతి తక్కువగా 40,930 వచ్చాయి. యూనిఫారం 1,17,839 ప్రతిపాదన పంపగా ఒక్కరికి కూడా రాలేదు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 11,416కు గాను పూర్తిగా వచ్చాయి. వచ్చిన వాటిల్లో ఇంకా ఆయా పాఠశాలలకు పూర్తిస్థాయిలో చేరుకోని కారణంగా విద్యార్థులు పంపిణీ జరగలేదు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో అన్ని వస్తువులు చేరేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే కిట్లను నాణ్యతతో అందివ్వాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

25 లోపు విద్యార్థులందరికీ కిట్లు

ఈనెల 25 తేదీలోగా విద్యార్థి మిత్ర కిట్లు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అంది స్తాం. షూలు ఆలస్యంగా వచ్చినప్పటికీ 9 మండలాల్లో పంపిణీ చేశాం. యూనిఫాం కూడా నాలుగు మండలాలకు పంపిణీ చేశాం. మిగిలిన మండలాలకు నెలాఖరులోగా పంపిణీ చేస్తాం. ఈ రెండూ మినహా మిగిలిన కిట్లలో ఉన్న అన్ని ఐటెంలు పూర్తి స్థాయిలో అన్ని మండలాల్లో పంపిణీ చేస్తున్నాం.

ఎ.రామారావు, సమగ్ర శిక్ష ఎపిసి

చెట్టును బైక్ ఢీకొనడంతో చెల్లా చెదురుగా పడి ఉన్న యువకుల మృతదేహాలు

బొండపల్లిలో విషాదం

చెట్టును ఢీకొట్టి ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి-బొండపల్లి

మండల కేంద్రమైన బొండపల్లిలో విషాదం అలముకుంది. మండలంలోని చామలవలస సమీపంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు బొండపల్లికి చెందిన వారు కాగా, ఒకరు దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన వారు ఉన్నారు. మృతులంతా కల్లుగీత కార్మికులు. వీరి మృతితో బొండపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

బొండపల్లికి చెందిన పురం సతీష్ (22), నెల్లి రమణ (22) గీత కార్మిక వృత్తి చేస్తుంటారు. ఖాళీ సమయంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే పనులు చేస్తుంటారు. దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన గుత్తల దినేష్ (20) రెండు రోజుల క్రితం బొండపల్లిలో జరిగిన పండగ (వారాలు)కు బంధువుల ఇంటికి వచ్చాడు. వీరు ముగ్గురూ కలిసి బుధవారం మధ్యాహ్నం బొండపల్లి నుంచి చామలవలస సమీపంలో బావి వద్దకు స్నానం చేసేందుకు వెళ్లారు. చామలవలస సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో రమణ, దినేష్ అక్కడికక్కడే మృతి చెందగా, సతీష్‌ను వెంటనే 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

దినేష్‌కు తండ్రి లేడు. తల్లి సన్యాసమ్మ, చెల్లి వసంత ఉన్నారు. కుమారుడు మృతితో దిక్కులేనివారమయ్యామని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. పురం సతీష్‌కు తండ్రి లేడు. తల్లి రామయమ్మ, అక్క కొండమ్మ ఉన్నారు. అక్క కుమార్తెతో ఇటీవల సతీష్‌కు నిశ్చితార్థం అయ్యింది. మరికొద్దిరోజుల్లో పెళ్లి కావాల్సి ఉంది. ఇంతలోనే మృతి చెందడంతో వారంతా గుండెలవిసేలా రోదిస్తున్నారు. నెల్లి రమణకు తండ్రి కామయ్య, తల్లి అంకమ్మ, అన్నయ్య శ్రీను ఉన్నారు. ఎస్ఐ మహేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో మరిన్ని ఎంజెపి స్కూళ్లు ఏర్పాటు

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత
వచ్చే ఏడాది జూనియర్ కళాశాలగా జమ్మాదేవి పేట 'ఎంజెపి'

ప్రజాశక్తి-లక్కవరపుకోట

రాష్ట్రంలో బిసి గురుకుల పాఠశాలలకున్న డిమాండ్ రీత్యా మరిన్ని ఎంజెపి (మహాత్మజ్యోతిబా పూలే) స్కూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జమ్మాదేవి పేట ఎంజెపి బిసి బాలికల గురుకుల పాఠశాలను కళాశాలగా అప్ గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్ కోట మండలం లోని జమ్మాదేవి పేట గ్రామంలో ఉన్న ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి బుధవారం పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, మరుగుదొడ్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మంత్రి సవిత ముచ్చటించారు. విద్యా మిత్ర కిట్లు అందరికీ అందాయా... సన్నబియ్యంతో భోజనం పెడుతున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో వుంది శాతం ఫలితాలు సాధించడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంజెపి స్కూళ్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా మరిన్ని గురుకులాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకష్ణన్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మంత్రి మొక్క నాటారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, మయా జెడ్‌పిటిసి ఈశ్వరరావు, చింతపాలెం సర్పంచ్ ఎన్.సీతారాం పాత్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే లలితకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ నాగార్జున

డిసిసిబి బలోపేతానికి చర్యలు

డిపాజిట్లతోపాటు ఖాతాదారుల నమ్మకమూ ముఖ్యమే : చైర్మన్ నాగార్జున

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బలోపేతానికి పరస్పర సహకారంతో పని చేద్దామని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బ్యాంకు మీద ప్రజల్లో విశ్వాసం పెంచాలని సూచించారు. జిల్లాలోని బ్రాంచి మేనేజర్లు, సిబ్బందితో బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ..మార్చి 25 నాటికి బ్యాంకులో ఉన్న రూ.316 కోట్ల డిపాజిట్లను 400 కోట్లకు పెంచేందుకు, రూ.2150 కోట్లుగా ఉన్న బ్యాంకు వ్యాపార పరిమాణాన్ని రూ.2500 కోట్లకు పెంచడమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కొన్ని పిఎసిఎస్‌ల్లో సమస్యలు ఉన్నట్లు తనదృష్టికి వచ్చిందని, త్వరలోనేఅన్నింటినీ తాను పరిశీలిస్తానని చెప్పారు. భవనాలు, సౌకర్యాలు, సిబ్బంది సమస్యలను గుర్తించి.. పైస్థాయిలో వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. బ్యాంకులకు డిపాజిట్లు ఎంత అవసరమో.. ఖాతాదారుల నమ్మకమూ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. వసూళ్లు, చెల్లింపులు సక్రమంగా, సమయానికి జరిగేటట్లు చూడాల న్నారు. చాలా ఏళ్లుగా కొందరి చేతుల్లోనే ఈ వ్యవస్థ ఉండిపోయిందని..ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

సమగ్ర శిక్ష సిబ్బంది రిక్వెస్టు బదిలీలకు అవకాశం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాల ప్రకారం జిల్లా, మండల స్థాయిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న కెజిబివి టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్లు మరియుసైట్ ఇంజనీర్లు మొదలగు పోస్టులకు రిక్వెస్టు బదిలీలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎపిసి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19నుంచి 21వరకు సంబంధిత అధికారుల ధ్రువీకరణతో జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయములో కార్యాలయపు పని వేళల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

'తల్లికి వందనం'పై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- డెంకాడ

తల్లికి వందనం పథకం వర్తించని వారిని గుర్తించి గ్రామాల్లో విద్యాశాఖ సిబ్బంది విచారణ ప్రారంభించారు. ఆన్‌లైన్ తప్పిదం వల్ల అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తించలేదు. దీనిపై 'తల్లికి వందనం కోతలతో బంధనం'అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి విద్యార్థులకు ఎందుకు ఈ పథకం వర్తించలేదో విచారణ చేయాలని ఆదేశించారు. ఫలితంగా గ్రామాల్లో తల్లికి వందనం పథకం రాని వారిని విచారిస్తున్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పరికరాలకు రాయితీ చెక్కును అందించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు 48 గంటల్లో తమ ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో బకాయి పడ్డ రూ.1600 కోట్లు బకాయిలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయిడు చెల్లించి రైతులను ఆదుకున్నారన్నారు. అన్నదాత సుఖీభవ రూ.20 వేలు సాయం వచ్చే నెలలో రైతు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రాష్ట్రంలో రూ.60 కోట్లతో 50 శాతం రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేస్తున్నా మన్నారు. రైతు సాధికారత ద్వారా రూ.76,600 కోట్లు అందజేసామన్నారు. అనంతరం నియోజకవర్గానికి రూ.1.96కోట్ల చెక్‌ను ఆయన అందజేశారు. సంకిలి చెరకు ఫ్యాక్టరీ విషయంలో తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ టి.లక్ష్మునాయుడు, వ్యవసాయ శాఖ జెడి వి.టి రామారావు, ఎడిఎ యం.శ్యాంసుందర్, మున్సిపల్ చైర్మన్ ఆర్.శరత్‌కుమార్, ఎంపిడిఒ రవికుమార్, రాష్ట్ర టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

తల్లికి వందనంపై వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. స్థానిక కోటలో బుధవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామిలో భాగంగా తల్లికి వందనం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇస్తే వైసిపి దుష్ప్రచారం చేస్తుందన్నారు. వైసిపి హయాంలో అమ్మఒడి ఇంటిలో ఒక్కరికి ఇస్తే కూటమి ప్రభుత్వం ఇంటిలో ఎంతమంది చదువుకుంటే అందరికి తల్లికి వందనం ఇచ్చినట్లు చెప్పారు. రైతు శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఒకొక్కరికి రూ.20 వేలు ఏడాదికి అందిస్తామన్నారు. బొబ్బిలి ఎపిఐఐసి గ్రోత్ సెంటర్ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పరిశ్రమలు స్థాపించి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా ఉన్నారు.

వ్యవసాయ పరికరాల కోసం రైతులకు రాయితీ చెక్కు అందజేస్తున్న మంత్రి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

జిఎస్‌టి చెల్లింపుతో ఆదాయం పెంచాలి

నిర్మాణ రంగానికి చెందిన శాఖల సహకారం అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిఎస్‌టి చెల్లించడం, బకాయిలు చెల్లించడం ద్వారా జిల్లా రెవిన్యూను పెంచడానికి కృషి చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లా మొదటి త్రై మాసికంలో 85 శాతం మాత్రమే జిఎస్‌టి చెల్లింపులు జరిగాయని, ఇది శత శాతానికి చేరాలని అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జి.ఎస్.టి అధికారులతో కలిసి పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పన్నుల రూపం లో ప్రభుత్వానికి ఆదాయం చేరితేనే సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలకు అవకాశం ఉంటుందని, జిఎస్‌టి వసూలు , బకాయిల వసూలులో జిల్లా అధికారులు సహకరించాలని తెలిపారు. జిల్లాలో నున్న ఎంఎస్ఎంఇల వివరాలను , కొత్తగా స్థాపించిన పరిశ్రమల వివరాలను పరిశ్రమలశాఖ జిఎస్‌టి కార్యాలయానికి ఇవ్వాలని సూచించారు. భవన నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు ఫ్లాట్స్ ను కట్టి అమ్మివేస్తున్నారని, జి.ఎస్.టి చెల్లించడం లేదని, వాటి వివరాలను కూడా రిజిస్ట్రేషన్ శాఖ అందజేయాలని కోరారు. సమావేశంలో జిఎస్‌టి జాయింట్ కమిషనర్ బి.నాగార్జున రావు, డిఆర్ఓ శ్రీనివాసమూర్తి, జెడ్‌పిసిఇఒ సత్యనారాయణ, జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్ వల్లి, అసిస్టెంట్ కమిషనర్లు అచ్చయ్య, రమేష్ కుమార్ , పరిశ్రమల శాఖ జి.ఎం కరుణాకర్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్. ఆర్అండ్‌బి, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ ఎస్ఇ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సర్కారు బడులు

- ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయుల కొరత
- ఏకోపాధ్యాయ పాఠశాలలే అధికం
- వెంటాడుతున్న మౌలిక సదుపాయాల సమస్య

ప్రజాశక్తి-సంతకవిటి

పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ప్రభుత్వ బడుల్లో కనిపిస్తోంది. కనీసం మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. వైసిపి హయాంలో చేపట్టిన నాడు-నేడు పనులు నిలిచిపోవడంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఆ పాఠశాల భవనాలు శిధిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది.

మండలంలోని మొత్తం 74 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 54, ప్రాథమికోన్నత పాఠశాలలు 11, ఉన్నత పాఠశాలలు 9 ఉండగా, మండలంలోని ఒక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉంది. ఈ పాఠశాలల్లో మొత్తం 3,844 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలంలోని ప్రవేట్, కార్పొరేట్ పాఠశాలలు 7 ఉన్నాయి. కావలి ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు ఎదుట కోనేరు చెరువు ఉంది. ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ప్రసాద్ చొరవతో పాఠశాలకు ప్రహరీ పనులు వేసవి సెలవుల్లోనే ప్రారంభించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రానున్నది వర్షకాలం కావడంతో వర్షపు నీటితో కోనేరు నిండితే ఏ ప్రమాదం సంభవిస్తోందోనన్న విద్యార్థులు భయపడు తున్నారు. పాఠశాల అవరణంలో పిచ్చిమొక్కలు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం పాఠశాల ప్రారంభమైనా ఆ పిచ్చి మొక్కలను తొలిగించే నాదుడే కరువయ్యాడు. పాఠశాలకు కనీసం కిటికీలు లేకపోవడంతో విషసర్పాలు బారిన పడతామేమోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలకు మంచినీటి సమస్య ప్రధానంగా ఉంది. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలకు కనీసం ప్రహరీ లేదు. గతంలో ఈ ప్రహరీ నిర్మాణానికి నా బోర్డు నిధులు నుండి కోటిన్నర రూపాయలు మంజూరు అయ్యాయని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌కు ప్రజాశక్తి వివరణ కోరగా తమకు నిధులు సంగతి తెలియదని అన్నారు. దీంతో కోటిన్నర నిధులు ఎటువైపు మళ్లించారో తెలియని పరిస్థితి నెలకొంది.

కావలి ప్రభుత్వ పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు

ఎం.ఆర్ అగ్రహారంలో మురుగు కాలువలో ఉన్న తాగునీటి పైపులు

పూర్తి కాని నాడు-నేడు పనులు

మండలంలోని 19 పాఠశాలల్లో నాడు - నేడు పనులు నిలిచిపోయాయి. కావలి, శేషాద్రిపురం, పనసపేట, ఎస్.అగ్రహారం, మంతిన, మల్లయ్యపేట, రామరాయపురం, బిల్లాణి, షాలిపేట తదితర పాఠశాలలో నాడు - నేడు పనులు జరగకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని పాఠశాలలకు రక్షణ గోడలు, మంచి నీటి సదుపాయాలు కూడా లేవు.

మురుగు కాలువల్లో తాగునీటి పైపులైను

ఎం.ఆర్ అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో తాగునీరు పైపులు మురుగు కాలువలో ఉన్నాయి. దీంతో ఏమైనా మంచినీటి పైపులు లీక్ అయితే విద్యార్థులు రోగాల బారినపడే అవకాశం ఉంది. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొండగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిల్ స్టాండ్ లేకపోవడంతో ఆరుబయట ఆవరణంలో పెడుతున్నారు.

వంటశాలలకు రేకుల షెడ్డే గతి

మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు ప్రత్యేక గదులు లేవు. మండల కేంద్రంలో ఆరుబయటే వంట చేస్తున్నారు. రానున్న వర్షా కాలంలో వంటశాలలు లేకపోతే ఎలా వంటలు చేసేదని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు.

ఏకోపాధ్యాయులతోనే..

మండలంలోని 26పాఠశాలలు ఒకేఒక్క ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఉపాధ్యాయుడు సెలవు పెడితే సిఆర్‌పి వచ్చి చదువు చెప్పే పరిస్థితి నెలకొంది. దీంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.

సర్కారు బడిలోనే మెరుగైన విద్య



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నాం. కార్పొరేట్‌కు ధీటుగా పదో తరగతిలో మండలంలోని 90 శాతం ఫలితాలు వచ్చాయి. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశాం. ఇంకా యూనిఫాం, షూష్ ప్రభుత్వం నుండి రాలేదు. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

– బి. శాంతికుమారి, ఎంఇఒ, సంతకవిటి

సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చెయ్యాలి

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చెయ్యాలి. ఏకోపాధ్యాయులు ఉన్న పాఠశాలలకు మరో ఉపాధ్యాయులను నియమించాలి. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి. ప్రభుత్వం కార్పొరేట్ స్కూళ్లను ప్రోత్సహించడం సరికాదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి.

-పి.రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

అంగన్‌వాడీలకు 'తల్లికి వందనం' ఇవ్వాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

అంగన్‌వాడీలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని మండలంలోని అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ వి.మాధురికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి పథకాలు అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు వర్తించకపోవడం అన్యాయమని అన్నారు. గ్రామంలో నెలకు ఆదాయం రూ.10వేలు, పట్టణాల్లో రూ.12వేలు కంటే తక్కువగా ఉండే వారికి పథకం వర్తింపచేస్తున్నప్పటికీ, గౌరవ వేతనం పొందుతున్న అంగన్వాడీలను సిఎఫ్ఎంఎస్ నుంచి జీతం వస్తుందని అభ్యంతరం చెబుతూ అనర్హులుగా ప్రకటించడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం ఆదాయ పరిమితిని రూ.25వేలకు పెంచి అంగన్వాడీ ఉద్యోగులను కూడా పథకానికి అర్హులుగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడిపి బీమా చెక్కు రూ. 5లక్షలను కోటలో బుధవారం ఎమ్మెల్యే బేబినాయన అందజేశారు. రామభద్రపురం మండలం గొల్లలపేటకు చెందిన బాలి ఆదిలక్ష్మి ప్రమాదంలో మరణించారు. ఆమెకు టిడిపి సభ్యత్వం ఉండడంతో బీమా రూ.5లక్షలు మంజూరైంది. ఈ బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు. టిడిపి కార్యకర్తలకు అండగా ఉండేందుకు అధిష్టానం బీమా చేపించినట్లు బేబినాయన చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. పేదల ఇంట ఆనందం

రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్

ప్రజాశక్తి - బాడంగి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుతో తల్లుల మోముల్లో ఆనందం వెల్లి విరుస్తుందని, ప్రభుత్వానికి తల్లులు వందనం చేస్తున్నారని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ చదువుకు మించి ఆయుధం లేదని, చదువుతో ప్రపంచాన్ని మార్చవచ్చున్నారు. పిల్లల చదువుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పాఠశాలలు తెరచిన నాటికి సకాలంలో ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో విద్యార్థులకు ఉపయోగపడిందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల సబ్ స్టేషన్ 33/11కెవి పరిధి గుర్ల 11కెవి రూరల్ ఫీడర్ మీద వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగింపు, చెట్టు కొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం జరజాపుపేట, గరికిపేట, కొండగుంపాం, పూతికపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవం సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఎంవిఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 44 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి గుర్తింపు పత్రాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, రెడ్ క్రాస్ ప్రతినిధి ఎం.రాము, ఆర్‌వివి రమణ మూర్తి, డిప్యూటీ తహశీల్దార్ కె.రవికుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ పరిశీలన

ప్రజాశక్తి- బాడంగి

కోడూరు రెవెన్యూ పంచాయతీలో ఉన్న కంసాల బంధ, నంబోడు చెరువును కొంతమంది పెద్దందారులు ఆక్రమిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి సురేష్ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ స్థానిక ఆర్ఐ, విఆర్‌ఒని బుధవారం ఆక్రమణ గురవుతున్న చెరువు వద్దకు పంపించి పరిశీలించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి పరిశీలనకు వచ్చిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

విద్యార్థినిలకు సీజన్ వ్యాధులు పట్ల వియ్యంపేట వైద్య సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ ఎన్‌విఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, టైఫయిడ్, చికెన్ గునియా, పచ్చ కామెర్లు, డైయేరియా, వంటి వ్యాధులు, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై హెల్త్ అసిస్టెంట్ ఎల్. సత్యారావు పలు సూచనలు చేశారు. విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కంటి సమస్యలు ఉంటే తెలియజేయాలనీ తెలిపారు. ఏజెన్సీ ఏరియా అరుకు, పాడేరు, దేవరపల్లి, సాలూరు, మక్కువ, పార్వతీపురం నుండి వచ్చిన 45 మంది విద్యార్థినిలకు మలేరియా ఆర్‌డిటి కిట్స్ ద్వారా సామూహిక రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ మాధవి, హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు, ఏఎమ్ భవాని, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రిక్క ఆదినారాయణ తహశీల్దార్ ఎమ్ రమణమ్మకు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గుజ్జు వెంకటరమణ, సోముబాబు, రాము తదితరులు కలిసి సుమారు 20సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా భవనాలు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరి అనుమతులు లేకుండా తాగునీటి బోరును కూడా తవ్వారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదు చేసినట్లు తహశీల్దార్‌కు తెలిపారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి అక్రమ నిర్మాణాలు తొలగించాలని తెలిపారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారని ఆదినారాయణ విలేకరులకు తెలిపారు. మాజీ వార్డు సభ్యులు రిక్క నర్సింగరావు, టిడిపి నాయకులు తాటిపూడి ఉదయ్ కుమార్, గోక సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్‌కు బదిలీ

ప్రజాశక్తి - రామభద్రపురం

ఎస్‌బిఐ రామభద్రపురం బ్రాంచి మేనేజరు బెలగాం హరీంద్రకు జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యింది. ఈయన సుమారు ఏడాది ఈ బ్రాంచ్ లో విధులు నిర్వహించారు. ఖాతాదారులతో మమేకం అయ్యి తనదైన శైలిలో విశిష్ట సేవలు అందించారు. సమయపాలన పాటిస్తూ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అన్ని పథకాల అమలకు కృషి చేశారు. బదిలీ సందర్భంగా సిబ్బంది హరీంద్రను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నూతన బ్రాంచ్ మేనేజర్‌గా బొబ్బిలి ఆర్‌బిఒ నుంచి బీ.నాగరాజు విధుల్లో చేరనున్నారు. ఈ కార్యక్రమంలో క్యాష్ ఇన్చార్జి హరికృష్ణ, సిబ్బంది లక్ష్మం నాయుడు, ధర్మారావు, శ్రావణి, అరుణకుమారి, సిఎస్‌పి పి.వీ సత్యారావు పాల్గొన్నారు.

తెలుగు జాతి స్ఫూర్తి.. కీర్తి 'చిరంజీవి'

జనసేన నేత గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జిఎస్ఆర్ హోటల్‌లో జనసేన నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యాన పుట్టినరోజు వారోత్సవాల పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ తెలుగు సినిమాకు చిరంజీవి గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. వెండితెరపై ఎన్నో మరపురాని పాత్రల్లో నటించి మెప్పించారని గుర్తు చేశారు. సేవా రంగంలో మెగాస్టార్ చిరంజీవి ఎవరెస్టు శిఖరమన్నారు. సినీ, రాజకీయ , సేవా రంగాల్లో చిరంజీవి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెగా అభిమానులు రంగనాయకులు, చక్రవర్తి, హుస్సేన్ ఖాన్, ఏంటి రాజేష్, బొబ్బది చంద్రనాయుడు, లక్ష్మణ్, కుమార్, బొబ్బాది అప్పలనాయుడు, మిమ్స్ శ్రీను, సతీష్, సురేష్ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల బాగు కోసం యోగా

రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి సవిత

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రస్తుత తరంతోపాటు, భవిష్యత్తు తరాల ఆరోగ్యం కోసం, వారి బాగు కోసం ప్రతీఒక్కరూ యోగా అలవర్చుకోవాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళిశాఖామంత్రి ఎస్.సవిత కోరారు. గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి యోగాంధ్ర కార్యక్రమ సన్నద్ధతపై గంట్యాడ మండలం కొటారుబిల్లిలో బుధవారం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సవిత మాట్లాడుతూ 2015లో ఐక్యరాజ్యసమితిలో యోగా దినోత్సవాన్ని ప్రతిపాదించగా, 2016 నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా రోగాలను దూరం చేసి, జీవితాలను సుఖమయం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివద్ధి, పర్యావరణ పరిక్షణతోపాటు యోగాకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు.

రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రపంచ యోగా దినోత్సవాన్ని రికార్డుస్థాయిలో నిర్వహించే అవకాశం మన రాష్ట్రానికి రావడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగస్వాములు కూడా మనకు గర్వకారణమని చెప్పారు. దీనివల్ల యోగా ప్రాముఖ్యత అందరికీ తెలుస్తుందన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. ప్రతీఒక్కరూ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 21వ తేదీ ఉదయం 3 గంటలకే బస్సులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బంధీగా నిర్వహించాలని మంత్రి సూచించారు. డిసిసిబి ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ, యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డును తప్పకుండా సాధిస్తామని అన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సవరమ్మ, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లు విజయకుమార్, ఎంపిడిఒలు రమణమూర్తి, కల్యాణి, గిరిబాల, ఇఒపిఆర్‌డిలు, యోగాంధ్ర పార్టీ ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి, పలువురు కూటమి పార్టీల నాయకులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా ఉత్సవం చరిత్రలో నిలిచిపోవాలి

విశాఖపట్నంలో ఈనెల 21న నిర్వహించబోయే యోగ ఉత్సవం చరిత్రలో నిలిచిపోవాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి కూటమి నాయకులు కార్యకర్తలు సమీక్ష సమావేశంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. జీవితంలో యోగా ముఖ్యపాత్ర పోషిస్తుందని మానసిక ప్రశాంతతకు శారీరక ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతుందని యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవడంతో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని అన్నారు.

విజయనగరం : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

విజయనగరంలోని టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, కొండపల్లిశ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ మాట్లాడారు. యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కుడ్య చిత్రాలు చిత్రీకరణ

విజయనగరం టౌన్ : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుడ్య చిత్రాల చిత్రీకరణ ప్రక్రియ పూర్తయ్యింది. స్థానిక సంతకాల బ్రిడ్జి కు ఆనుకొని ఉన్న గోడలపై యోగా ప్రక్రియలు విశదపరిచే కుడ్య చిత్రాలను చిత్రీకరించారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చిత్రకారులచే చిత్రీకరించిన కుడ్య చిత్రాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు యోగ పట్ల మరింత అవగాహన కల్పించేందుకు ఈ తరహా చిత్రాలు చిత్రీకరించామని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి : కమిషనర్

విజయనగరం టౌన్ : అందరి సమన్వయంతో ప్రపంచ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో యోగాంధ్ర కార్యక్రమ విధివిధానాలను వెల్లడించారు. ఈనెల 21 న విశాఖపట్నంలో జరిగే యోగా దినోత్సవ కార్యక్రమానికి నగరపాలక సంస్థ పరిధి నుండి 114 బస్సులలో సుమారు 5600 మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. 21వ తేదీ ఉదయం 3గంటలకు నిర్దేశించిన ప్రదేశాలలో బస్సులను సిద్ధంగా ఉంచుతామన్నారు. 4:30 గంటలకు భీమిలిలో సిద్ధంచేసిన యోగ వేదికల వద్దకు వారిని చేర్చుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్‌ఒ సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విశాఖ కు యోగాంధ్ర ట్రయల్ రన్

విజయనగరం: ఈనెల 21 న జరిగే యోగంధ్ర కార్యక్రమానికి హాజరు కావడానికి గురువారం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. మండలాల నుండి బస్సు లు ఉదయం 8గంటల లోపల కలెక్టరేట్ వద్ద కు చేరుకోవాలని, విజయనగరం నుండి ఉదయం 8 గంటలకు బస్సు లు బయలు దేరతాయని, ప్రతి మండలానికి ఒక బస్సు చొప్పున ఆ మండలానికి చెందిన లైజన్ అధికారులతో బయలు దేరాలని తెలిపారు. బుధవారం లైజన్ అధికారులతో కలెక్టర్ వెబెక్స్ ద్వారా మాట్లాడారు. జిల్లా నుండి 15 వేల మంది హాస్టల్ విద్యార్థులు, 15 వేల మంది సాధారణ ప్రజలు యోగాంధ్ర కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. బీచ్‌లో జిల్లా కోసం 30 కంపార్ట్మెంట్ లను ఏర్పాటు చేసారని, బస్సులో లైజన్ అధికారితో పాటు పొలిటికల్ ప్రతినిధి కూడా హాజరవుతారని తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే లోకం మాధవి తెలిపారు. బుధవారం ఆమె సీతారాముని పేటలో ఖరీఫ్ 2025 సీజన్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పంటలకు మంచి పునాది వేయాలంటే నాణ్యమైన విత్తనాలు కీలకమని ప్రతి రైతుకూ రాయితీపై విత్తనాలు అందుబాటులోకి తేవాలన్నదే తమ కృతనిశ్చయమని అన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంబార్కి రామలక్ష్మీ, జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, చీపురుపల్లి, విజయనగరం ఎడిఎలు ఎన్.కోటేశ్వరరావు, బి.నాగభూషణం, ఎఒలు పి.శ్రీలక్ష్మి, టి.సంగీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

సారిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఎమ్మెల్యే లోకం మాధవి చేతుల మీదుగా ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్ నాథ్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, టౌన్ డిఇఇ పి. త్రినాధరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

రైతులకు ఇబ్బందులు లేకుండా విత్తనాలు

లక్కవరపుకోట: రైతులకు ఇబ్బందులు లేకుండా వరి విత్తనాలు సకాలంలో ప్రభుత్వ అధికారులు అందించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ ఖరీఫ్ కాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు అందరూ కూడా అలసత్వం వహించకుండా రైతులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. రైతులు సకాలంలో ఆన్ లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని కొనుగోలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చక్కాకుల మల్లునాయుడు, గవర కార్పోరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, కాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులను అందజేస్తున్న కానిస్టేబుల్

పోగొట్టుకున్న సొమ్ము అందజేత

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

పోగొట్టుకున్న సొమ్మును పోలీసులు మహిళకు అందించినట్లు గజపతినగరం ఎస్ఐ కిరణ్ కుమార్‌నాయుడు బుధవారం తెలిపారు. గజపతినగరం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో నివాసముంటున్న మహిళ ప్రైవేట్ పాఠశాలకు ఆటోలో వెళ్తూ తన 30 వేల రూపాయలు పోగొట్టుకుంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి దానిని కనిపెట్టి మహిళకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులను అభినందించారు.

డబ్బులిస్తేనే పనులు చేస్తారా?

◆ మండల సమావేశంలో సభ్యుల ధ్వజం ◆సమస్యల సాగదీతే సమావేశాల లక్ష్యమా? అని రామభద్రపురంలో నిలదీత

వంగర : సిఎస్‌డిటిని ప్రశ్నిస్తున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ

ప్రజాశక్తి - వంగర

రెవెన్యూ శాఖలో ఏ పని అవసరం ఉన్నా డబ్బులు ఇస్తే గాని పనులు అవ్వటం లేదని సర్వసభ్య సమావేశంలో ఎంపిపి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. రెవెన్యూ శాఖకు సంబంధించిన చర్చిలో పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ సంబంధించి ఏ పని కావాలన్నా డబ్బులు ఇస్తే గాని పనులు జరగటం లేదని ఇదే విషయాన్ని పలుమార్లు వారికి తెలియజేసినప్పటికీ వారి పనితీరు మారలేదని అన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం డబ్బులు అడుగుతున్నారంటే వారి పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని దీని వల్ల పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. సివిల్ సప్లైకు సంబంధించి డీలర్లకు ఇచ్చిన కోటాలో బస్తాకు సుమారు 5 కేజీల వరకు తరుగు వస్తుందని అందువల్ల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. తోటపల్లి కాలువకు సంబంధించి ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందిస్తారా..? అని సభ్యులు ప్రశ్నించారు. గీతనాపల్లి సర్పంచ్ నెయ్యిగాపుల శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు సరిపడినట్లుగా ఇవ్వకపోవడంతో పక్క మండలానికి వెళ్లి విత్తనాలు కొనుక్కునే పరిస్థితి ఉందన్నారు. తల్లికి వందనం అర్హులకు పడలేదని ఎంపిపి సభ దృష్టికి తీసుకొచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని సభలో సభ్యులు ఏకాగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రఘునాథ చారి, కరణం సుదర్శన రావు, ఎఒ కన్నబాబు, ఎంఇఒ జగదీశ్వరి, విద్యుత్తు శాఖ ఎఇ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ, వెలుగు అధికారుల పనితీరుపై అసంతృప్తి

రామభద్రపురం: సమస్యల సాగదీతే లక్ష్యంగా ప్రతి 3 నెలలకు జరిగే సర్వసభ్య సమావేశాలు కొనసాగుతున్నాయని ప్రజా ప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన బుదవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల లక్ష్యాలు పనితీరుపై వివరించారు. ముఖ్య శాఖల పనితీరు, అమలు చేస్తున్న లక్ష్యాలు గత సమావేశాల్లో చర్చించిన సమస్యలు నేటివరకు నెరవేరలేదని అధిక శాతం సబ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు గ్రామ సర్పంచ్, ఎంపిటిసి సభ్యులంటే చులకన భావం ఉందని గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో జరిగే అభివృద్ధి పనులను చెప్పడం లేదని కనీసం వారి విధులను బాధ్యతగా నెరవేర్చడం లేదని రొంపల్లి ఎంపిటిసి బవిరెడ్డి శంకర్రావు, పాతరేగ సర్పంచ్ రాజు ఎపిఒ త్రినాధరావుని నిలదీశారు. వెలుగు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామాల్లో సంఘాలకు ఇచ్చిన స్త్రీ నిధి రికవరీల్లో వాయిదాకి మించి వసూళ్లు చేస్తున్నారని దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని పాతరేగ ఎంపిటిసి మడక తిరుపతిరావు డిమాండ్ చేశారు. మేజర్ పంచాయతీ రామభద్రపురంలో వీధి లైట్లు, కుళాయి నుంచి నీటి సదుపాయం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి బవిరెడ్డి చంద్ర ఈవోను కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రత్నం, ఉప తహశీల్దార్ గిరిధర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు బుధవారం నిరసన తెలిపారు. పలు వార్డులకు చెందిన మహిళలు తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ధర్నా, రాస్తా రోకో చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బైరెడ్డి వీధి, నాయుడుకాలనీ, చందక వీధిలకు గత నెల రోజులుగా తాగు నీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా వీధుల్లో తాగునీటి కుళాయిలు ఉన్నా దిష్టి బొమ్మల్లా ఉన్నాయని అధికార్లకు ఫిర్యాదు చేస్తే చంపావతి నది నీటి పథకాలు మరమ్మత్తులకు గురయ్యాయని చెప్పారని వాటిని బాగుచేసి నీటి సరఫరా చేస్తామని చెప్పినప్పటికి ఇంతవరకు బాగుచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా నగర పంచాయతీలో నీటి సరఫరా జరగకపోయినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

ఐసిడిఎస్ పీడీగా విమలరాణి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.విమలా రాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీపురుపల్లి ప్రాజెక్టులో పనిచేసిన అనుభవం ఉందని, జిల్లాపై అవగాహన ఉన్నందున స్త్రీ శిశు సంక్షేమ శాఖను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అంగన్వాడి కేంద్రాలను తెరిచిన విషయంలో సమయపాలన పాటించాలన్నారు పిల్లలకు క్రమం తప్పకుండా పూర్వ ప్రాథమిక విద్యను ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలన్నారు. ఈ సందర్భంగా పీడీకి డిసిపియు లక్ష్మి, సీనియర్ సహాయకులు సదాశివం, నోడల్ ఆఫీసర్ బిటి నాయుడు, ఎల్ఒ విద్య, సఖి వన్ స్టాప్ సెంటర్, ఆఫీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న విమలరాణి

మోడీ పర్యటనకు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఈనెల 21న విశాఖ సముద్ర తీరంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కానున్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. బందోబస్తు, భద్రత విధుల్లో పాల్గొననున్న పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు గురించి రుషికొండ వద్ద ఎ1 ఫంక్షన్ హాలు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎఆర్ ఎస్‌పి అశోక్ కుమార్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత జి.నాగేశ్వరరావు, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పది ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టే విధంగా నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలో 10 ప్రాంతాలలో ప్రయోగాత్మకమైన ఇంకుడు గుంతల ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. ఇంజినీరింగ్ అధికారులు గుర్తించిన ప్రాంతాల్లో గుంతలను తీసే కార్యక్రమాలను చేపట్టారు. ఇటీవల నగరానికి చేరుకున్న ఇస్రో శాస్త్రవేత్త ఇంకుడు గుంతలపై సర్వే చేపట్టి అందుకు తగ్గ ప్రాంతాలను గుర్తించారు. 100 అడుగుల లోతున గుంతల తవ్వే ఏర్పాట్లు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వర్షపు నీరు, వృథా నీరును ఒడిసి పట్టే క్రమంలో ప్రయోగాత్మకమైన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

21న ప్రపంచ సంగీత దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన కొత్త అగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాలులో ఈనెల 21న సంగీత దినోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 నుండి 8 వరకు విశేష సంగీత కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం ప్రఖ్యాత విద్వాంసులు ఎం.భీష్మారావు రావుకు సత్కార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రఖ్యాత చార్టెడ్ అకౌంటెంట్ ఇఆర్ సోమయాజులు హాజరవుతారన్నారు.

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొండచాకరాపల్లి ఎస్‌టి కులానికి చెందిన బంటుపల్లి శంకరరావుపై కొప్పరవలస గ్రామానికి చెందిన బిసి కులస్తులు కోట్ల గణేష్, కోట్ల అప్పలరాము, రేగిడి మండలం తోకలవలస గ్రామానికి చెందిన బుడితి రాంబాబు ఈ నెల 17న కులం పేరుతో దూషించడంతోపాటు శంకరరావు పీక పై బీరు బాటిల్‌తో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు కావడంతో చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు ఘటనా స్థలానికి బుధవారం చేరుకుని బీరు బాటిళ్లు అక్కడ ఉన్నట్లు గుర్తించారు. దర్యాప్తు చేపట్టి సాక్షులను విచారించారు. దర్యాప్తు పూర్తయిన వెంటనే నిందితులను అరెస్టు చేస్తామని వెల్లడించారు. ఈ దర్యాప్తులో వంగర ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి.. వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కనిమెట్టలో అనధికార మద్యం విక్రయాలపై బుధవారం భోగాపురం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తి వద్ద నుంచి 180 ఎంఎల్ పరిమాణం గల 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడులు ఎక్సైజ్ సిఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు మహేష్, సూర్యనారాయణ చేశారు. అనధికార మద్యం విక్రయాలపై సమాచారం అందించాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను బుధవారం ఆమె చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం కోసం సన్న బియ్యం కూడా ఇస్తున్నామన్నారు. విద్య కోసం పాటుపడిన సర్వేపల్లి రాధాకృష్ణ పేరుమీద విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకంలో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మంది పిల్లలకు డబ్బులు వేశామన్నారు. ఆన్‌లైన్ తప్పుదాల వల్ల అర్హులైన కొంతమందికి ఈ పథకం వర్తించలేదన్నారు. ఇందుకోసం ప్రతి సచివాలయంలోనూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకం వర్తించేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పినతాడివాడ గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపల్ పి.హైమా, ఎస్ఐ ఏ. సన్యాసినాయుడు, విజయనగరం టిడిపి పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ పాణిరాజు, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్, గాయత్రి కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి